ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేది: 20.05.2026 సమయం: 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. హైదరాబాద్ మెట్రో రెండోదశ ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వానికి ఎటువంటి ఇబ్బంది లేదని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 50:50 ఖర్చుచేసే ప్రాతిపదికన కేంద్రం ముందుకెళ్లేందుకు సిద్ధంగా ఉందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి తెలిపారు.
2. "స్వచ్ఛ భారత్ మిషన్–అర్బన్ 2.0" జాతీయ సమీక్ష సమావేశంలో తెలంగాణ విజన్–2047 లక్ష్యాలకు అనుగుణంగా రాష్ట్రాన్ని పర్యావరణహితంగా అభివృద్ధి చేస్తున్నామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు వెల్లడించారు.
3. ఈ-ఫార్మసీల అమ్మకాలకు వ్యతిరేకంగా ఫార్మసీ వ్యాపార సంఘాల పిలుపు మేరకు ఈరోజు తెలంగాణలో ఔషధ దుకాణాల బంద్ కొనసాగుతోంది.
4. ఈరోజు, రేపు ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, నల్గొండ, సూర్యాపేట జిల్లాలకు వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది. వచ్చే మూడు రోజుల్లో ఉష్ణోగ్రతలు గరిష్టంగా పెరగనున్నాయని వెల్లడించింది.

---------------------------------------

**HYD METRO 2 ND PHASE:**

హైదరాబాద్ మెట్రో రెండోదశ ప్రాజెక్టుకు సూత్రప్రాయంగా కేంద్ర ప్రభుత్వానికి ఎటువంటి ఇబ్బంది లేదని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 50:50 ఖర్చుచేసే ప్రాతిపదికన కేంద్రం ముందుకెళ్లేందుకు సిద్ధంగా ఉందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌తో కలిసి హైదరాబాద్ నగర ప్రాజెక్టులపై సమీక్ష నిర్వహించినట్లు జి.కిషన్ రెడ్డి వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం సమర్పించిన 162 కిలోమీటర్ల మెట్రో విస్తరణ ప్రతిపాదనల డీపీఆర్ అందిన తర్వాత కేంద్రం సానుకూలంగా పరిశీలించి తదుపరి చర్యలు తీసుకుంటుందని ఖట్టర్ హామీ ఇచ్చినట్లు కిషన్ రెడ్డి

వివరించారు. అమృత్ 2.0 పథకం కింద 3 వేల 975 కోట్ల రూపాయల వ్యయంతో మూసీనది మురుగునీటి శుద్ధి కోసం 39 సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లను కేంద్రం మంజూరు చేసిందని, వీటి ద్వారా రోజుకు 972 మిలియన్ లీటర్ల మురుగునీరు శుద్ధి అవుతుందని పేర్కొన్నారు.

**DESK**

---------------------------

**MC-YADAGIRIGUTTA:**

ఈ నెల 23న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి యాదగిరిగుట్ట పర్యటన దృష్ట్యా జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అక్షాంశ్ యాదవ్ అధికారులతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. వేదపాఠశాల శంకుస్థాపన ప్రాంగణాన్ని సందర్శించి భద్రత, పారిశుధ్యంపై సూచనలు చేశారు.

**PTC, YB**

----------------------------------

**DY CM**

న్యూఢిల్లీలో కేంద్ర మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ అధ్యక్షతన జరిగిన "స్వచ్ఛ భారత్ మిషన్–అర్బన్ 2.0" జాతీయ సమీక్ష సమావేశానికి తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు హాజరయ్యారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ విజన్–2047 లక్ష్యాలకు అనుగుణంగా రాష్ట్రాన్ని పర్యావరణహితంగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో అమలవుతున్న శాస్త్రీయ వ్యర్థాల నిర్వహణ, సుస్థిర పట్టణాభివృద్ధి, సర్క్యులర్ ఎకానమీ చర్యలను వివరించారు. కోర్ అర్బన్, పెరి అర్బన్, రూరల్ అగ్రికల్చరల్ రీజియన్‌ల సమతుల్య అభివృద్ధి కోసం ప్రభుత్వం CURE, PURE, RARE విధానాన్ని అనుసరిస్తోందని, ఘన వ్యర్థాల నిర్వహణ నిబంధనలు–2026 వ్యవస్థలో కీలక మార్పులు తెస్తున్నాయన్నారు.

**డెస్క్**

-----------------------------

**WORK SHOP - VIVEK**

భారత్, యూరోపియన్ యూనియన్ మొబిలిటీపై సోమాజీగూడలోని 'ద పార్క్' హోటల్‌లో రాష్ట్ర స్థాయి వర్క్ షాప్ ఏర్పాటు చేశారు. విదేశాంగ శాఖ, ఈయూ సంయుక్త ఆధ్వర్యంలో 'ఇండియా, ఈయూ మైగ్రేషన్ అండ్ మొబిలిటీ ప్రాజెక్ట్ ఫేజ్-2' కింద నిర్వహిస్తోన్న ఈ

కార్యక్రమానికి మంత్రి వివేక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. భారత్-ఈయూ మధ్య వలసలు, అంతర్జాతీయ ఉద్యోగ అవకాశాల మెరుగుదల వంటి కీలక అంశాలపై ఈ వర్క్ షాప్‌లో విస్తృతంగా చర్చించనున్నారు.

**DESK**

----------------------------------

**కొండా సురేఖ**

వరంగల్ నగర అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఈ మేరకు అభివృద్ధి కనిపిస్తుందని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. ఈరోజు వరంగల్ నగరానికి వచ్చిన కంచి కామకోటి పీఠం జగద్గురు శంకర విజయేంద్ర సరస్వతి స్వామీజీతో కలిసి భద్రకాళి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్య ఆసుపత్రిలో అంతర్గత సి సి రోడ్ల ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. కంటి ఆసుపత్రి అభివృద్ధిపై కమిటీతో సమీక్షలో పాల్గొంటున్నారు.

**పిటిసి, వరంగల్**

----------------------------------

**TPCC PRESIDENT:**

జనగణనలో కులగణన చేపట్టాలన్న సుప్రీంకోర్టు తీర్పును టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ స్వాగతించారు. రాహుల్ గాంధీ ఆశయాలకు అనుగుణంగా సామాజిక న్యాయం, ఆర్థిక అసమానతల తొలగింపునకు కులగణన ఎంతో అవసరమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణలో విజయవంతంగా ముగిసిన కుల సర్వే దేశానికే ఆదర్శంగా నిలిచిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అనుసరించిన ఈ శాస్త్రీయ విధానాన్ని ఆదర్శంగా తీసుకుని, కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా సమగ్ర కులగణనను తక్షణమే నిర్వహించాలని మహేష్ కుమార్ గౌడ్ డిమాండ్ చేశారు.

**డెస్క్**

--------------------------------

**CHECK POST**

మంచిర్యాల జిల్లా, రాపనపల్లి అంతర్ రాష్ట్ర చెక్‌పోస్ట్ వద్ద భారీగా నకిలీ వరి విత్తనాలను అధికారులు పట్టుకున్నారు. మహారాష్ట్ర నుంచి తెలంగాణలోకి అక్రమంగా తరలిస్తున్న 30 టన్నుల నకిలీ విత్తనాలను లారీలో తరలిస్తుండగా తనిఖీల్లో స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన విత్తనాల విలువ సుమారు 21 లక్షల 49 వేల రూపాయలు ఉంటుందని జైపూర్ ఏసిపి వెంకటేశ్వర్లు తెలిపారు. రైతులు విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో తప్పనిసరిగా బిల్లులు తీసుకోవాలని, గుర్తింపు పొందిన డీలర్ల వద్ద నుంచే విత్తనాలు కొనుగోలు చేయాలని అధికారులు సూచించారు. నకిలీ విత్తనాలపై కఠిన చర్యలు కొనసాగుతాయని హెచ్చరించారు.

**PTC, MNCL**

------------------------------

**MEDICAL**

రాష్ట్రంలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో 433 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి సంబంధించిన ప్రొవిజనల్ మెరిట్ లిస్టును మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు నిన్న విడుదల చేసింది. హైదరాబాద్‌లోని వెంగల్‌రావు నగర్‌లో ఉన్న ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ ప్రాంగణంలో ఈ నెల 22, 23 తేదీల్లో 1:3 చొప్పున అభ్యర్థులను సర్టిఫికెట్ వెరిఫికేషన్ జరగనుంది. వెరిఫికేషన్‌కు హాజరు కాలేని వారు, ఈ నెల 25వ తేదీన వచ్చి సర్టిఫికెట్లు అందజేయవచ్చునని బోర్డు తెలిపింది. సర్టిఫికెట్ వెరిఫికేషన్ అనంతరం, ఉద్యోగాలకు ఎంపికైన డాక్టర్ల జాబితాను విడుదల చేస్తామని బోర్డు పేర్కొంది.

**DESK**

-------------------------------

**GHMC:**

తెలంగాణ ప్రభుత్వం జీహెచ్ఎంసీకి చెందిన తొమ్మిది కొత్త పౌర సేవలను మీసేవ వాట్సాప్, చాట్‌బాట్ ద్వారా అందుబాటులోకి తెచ్చింది. ప్రజలకు డిజిటల్ సేవలను మరింత సులభతరం చేసేందుకు ఈ నిర్ణయం తీసుకున్నారు. దీని ద్వారా ఆస్తి పన్ను, జనన, మరణ ధ్రువీకరణల సవరణలు, ట్రేడ్ లైసెన్స్ రెన్యువల్ వంటి సేవలను రాష్ట్రవ్యాప్తంగా పౌరులు నేరుగా వాట్సాప్ ద్వారానే పొందవచ్చని ఎలక్ట్రానిక్ సర్వీస్ డెలివరీ విభాగం తెలిపింది.

**DESK**

--------------------------------

**TG INTER:**

ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం పరీక్షలో ఈరోజు Public Administration Paper – 2 కి Set 'బి' ప్రశ్నా పత్రాన్ని ఎంపిక చేసినట్లు ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శి తెలియచేశారు.

**DESK**

----------------------------------

**MEDICAL SHOPS BANDH:**

ఈ-ఫార్మసీల అమ్మకాలకు వ్యతిరేకంగా ఫార్మసీ వ్యాపార సంఘాల పిలుపు మేరకు ఇవాళ దేశవ్యాప్తంగా ఔషధ దుకాణాల బంద్ కొనసాగుతోంది. ఇందులో భాగంగా తెలంగాణలోని మెడికల్ దుకాణాలు మూతపడ్డాయి. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అన్ని ప్రభుత్వ ఆసుపత్రులు, బస్తీ దవాఖానాల్లోని ఫార్మసీలను 24 గంటల పాటు తెరిచి ఉంచాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశించారు. అపోలో, మెడ్‌ప్లస్ వంటి కార్పొరేట్ స్టోర్లను కూడా తమ సేవలు అందుబాటులో ఉంచాలని  డీసీఏ డీజీ సూచించారు. అత్యవసర ఔషధాల కోసం 1800-599-6969 టోల్‌ఫ్రీ నంబరును సంప్రదించాలని తెలిపారు.

**PTC, SANGAREDDY**

-------------------------------------

**TG WEATHER:**

తెలంగాణలో భానుడి ఉగ్రరూపంతో 45 డిగ్రీల పైగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. నేడు, రేపు ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, నల్గొండ, సూర్యాపేట జిల్లాలకు వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది. వచ్చే మూడు రోజుల్లో ఉష్ణోగ్రతలు గరిష్టంగా పెరగనున్నాయి. మరో వైపు పలు జిల్లాల్లో తీవ్ర వడగాల్లు వీచే అవకాశం ఉండగా, భద్రాద్రి, ఖమ్మం, మహబూబ్‌నగర్ వంటి మరికొన్ని జిల్లాల్లో ఉరుములు, ఈదురుగాలులతో కూడిన తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది.

**DESK/PN**

--------------------------